

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### చిత్రం భళారే విచిత్రం

**మా చిన్నప్పుడు భలే సినిమాలు వచ్చేవి.** పేదరాశి పెద్దమ్మ కథ, జ్వాలాద్వీప రహస్యం, సువర్ణ సుందరి కథ, గులేబకావళి కథ, బొమ్మలు చెప్పిన కథ, మహాబలుడు, కీలు గుర్రం, జగదేకవీరుని కథ, ఇలాంటి కథలు చందమామ, బాలమిత్రలాంటి పిల్లల కథల పుస్తకాల్లోనూ చదివేవాళ్లం. హీరో ఒక సామాన్యమైన మనిషిగా మొదలు పెట్టి, అనుకోకుండా అతనికి ఒక మంత్రదండమో, మాయా కంబళీనో, వింత తివాచీనో, అద్భుత దీపమో దొరికి, దాంతో అతనికి అసాధారణ శక్తులొచ్చేవి.

కీలు గుర్రంలో నాగేశ్వరరావు గుర్రం ఎక్కి ఆకాశంలో విమానం మీద వెళ్లినట్లు వెళ్లి రాజకుమార్తెని కలవడం చూస్తుంటే, మనకీ అలాంటి గుర్రం దొరికితే బావుండ్ను. ఈ బస్సులు ఎక్కడం బాధలు తప్పుతాయి అనుకునే వాళ్ళం. ఇంక మంత్రదండం చేతికి చిక్కితే హీరో ఎవరినైన ఎలాగైన మార్చెయ్యవచ్చు. చిలకగా, మేకగా, రాయిగా, చెట్టుగా మార్చేస్తుంటే, అందులోనూ దుష్టపాత్రల్ని, భలే నవ్వొచ్చేది, మా హిందీ సార్‌ని ఒంటెగా మార్చాలని అనుకునేదాన్ని.

సువర్ణ సుందరి కథలో, నాగేశ్వరరావు ఫ్లూట్ వినిపించగానే, అంజలీదేవి గింగిరాలు తిరుగుతూ వచ్చి అతని ముందు పడిపోవాల్సిందే. అలాగే మెడదాకా రాయి అయిపోయిన ఋషులు, చెట్లుగా మారిన గంధర్వులు, పూర్వం చేసిన పాపఫలం అనుభవిస్తూ బ్రహ్మరాక్షసులుగ మారిన వాళ్లూ సినిమాలో ప్రతిఘట్టానికీ కనపడి, భయం వేసేది. తప్పు చేస్తే ఇలా అవుతారు అన్న నీతి ఉండేది. గురువు ఆజ్ఞ పాటించాలి. ఎంత కష్టం అయినా తల్లి తండ్రుల చెర విడిపించాలి. శరణు అన్న వారిని రక్షించాలి. రాజకుమార్తెల్ని బతకనివ్వరీ రాక్షసులు. ఎత్తుకుపోయి ఏ ఒంటి స్థంబం మేడలోనో బంధిస్తారు. మళ్ళీ ఆ రాక్షసుల ప్రాణాలు అంత సులభంగా పోవు. వాటిని సేఫ్ డిపాజిట్ లాకర్‌లో పెట్టినట్లు సప్తసముద్రల అవతల ఏ చెట్టు తొర్రలోనో, లేకపోతే నిప్పులు కక్కుతూ తిరిగే చక్రాల అవతలో, అదీకాదంటే విషసర్పాల పడగల్లోనో దాచి పెడతారు. హీరోకి ఈ విషయం చెప్పడానికి ఒక అందమైన అప్సరస దార్లో కనపడి, నన్ను పెళ్ళాడు అని వెంటపడుతుంది. అతను తను రాజకుమార్తెని వెదుక్కుంటూ వెళ్తున్నాననీ, వచ్చేటప్పుడు పెళ్ళాడ్తాననీ మాటిస్తే అప్పుడీ రహస్యం చెప్పి, ఇతనికోసం వెయిట్ చేస్తూ ఉంటుంది.

హీరో సాహసవంతుడు అయినా అతనికి మాయా ఖడ్గమో, మంత్ర దండమో దొరికే వరకూ అతను రాక్షసుల్ని ఎదిరించి, పోరాడి చంపేవాడు కాదు. ఇవన్నీ కాక అతనికి కాళికామాత వరమో, శివుడి దీవెనో ఉండేది. అతని కోసం అటు తల్లో, ఇటు ప్రియురాలో 'అమ్మా.. జయమీయవే.. మము కాపాడవే' అంటూ అనంతమైన పూజలు చేస్తుండేవారు. వీలైతే తల్లి ఏ తాయిత్తో మంత్రి శక్తి కలది అతని చేతికి కట్టేది కూడా. ఈ విధంగా ఇన్ని మహిమలు జరిగాకా, అతను అజేయుడై, వీరుడై, రాక్షసుల్ని హతమార్చి, రాజకుమార్తె

చెరవిడిపించి, తల్లి తండ్రుల సింహాసనం తిరిగి దక్కించుకుని, దారిలో తనని ప్రేమించి వెంటపడిన మానవకాంతలని నిరాశపరచకుండా, వారినీ తీసుకుని రాజ్యానికొచ్చి, తన ప్రజల సమక్షంలో తల్లితండ్రుల అంగీకారంతో పరిణయం ఆడేవాడు. అప్పుడు 'ఇదండీ గులేబకావళీ కథ' అనో 'మరో కథ' అనో సూత్రధారి కథ ముగించేవాడు.

"వరించి వచ్చిన మానవ వీరుడు ఏమైనాడని విచారమా? ఔన చెలీ? ఔన చెలీ? అయితే వినవే నా మాటా" అనో లేకపోతే "రామచిలుక తెలుపవే ప్రేమ ఏవిటో? " అనో "సలామ లేకుం.. సాహేబ్‌గారూ.. భలే జోరుగ ఉన్నారూ?" అనో "కాదుసుమా కలకాదు సుమా" అనో తియ్యని పాటలు రసగుళికల్లా రాజకుమార్తెలు పాడుతూ నీళ్ళల్లో, పూలవనాల్లో తిరుగుతుంటే, ఓ అద్భుత ప్రపంచాన్ని చూసిన అనుభూతి కలిగేది.

ఈ ఆకర్షణలు అన్నీకాక మధ్య మధ్యలో మాట్లాడే చిలకలూ, జింకలూ, సాయంచేసే కోతులూ, పాములూ, మేకపోతులు కూడా కథలో వచ్చేవి. ఇవన్నీ కాక హీరో పక్కన 'అన్నయ్యా' అంటూ ఉండే సైడ్‌కిక్‌లు రాజబాబో, బాలకృష్ణో, పద్మనాభమో, విలన్ల పక్కన ఉండే శివరామో, అల్లురామలింగయ్యో, రేలంగో కూడా మనల్ని కితకితలు పెట్టినట్లు నవ్వించేవారు. మాయాబజార్‌లో 'తల్పం గిల్పం' సీన్ వచ్చినప్పుడల్లా మేం సీటులో నుండి కిందపడిపోయేట్లు నవ్వేవాళ్ళం.

ఇంక అసలు విషయానికొద్దాం. హీరోల ఫైట్లు. అవి జానపదంలో అయితే మల్లయుద్ధం, ద్వంధయుద్ధం, కత్తి యుద్ధం ఉండేవి. అవతల వాళ్ళు మంత్ర శక్తిలో అగ్ని ప్రజ్వరిల్లుతూ బాణాలేస్తే వీళ్ళు నీళ్ళలో బాణాలు వెయ్యడం, వాళ్ళు ముళ్ళ గదలు లాంటివి వేస్తే, వీళ్ళు రంపాల లాంటివి వేసి వాటిని తునాతునకలు చెయ్యడం, మంచి రీ రికార్డింగ్‌తో అటునుండి ఆ గదా, ఇటు నుండి ఈ కత్తి ఆకాశంలో చాలా దూరం ప్రయాణం చేసి, హీరో కత్తి గెలిచి గదని నేల కూల్చడం, ఇలాంటి దృశ్యాలప్పుడు పిల్లలు సీటు చివర కూర్చుని, గోళ్ళు కొరికేస్తూనో, తల్లి చీరకొంగు మొహాన కప్పుకునో భయం భయంగా చూడ్డం, ఆ యుద్ధం అయిపోయకా హీరో మెడలో విజయమాల ఆకాశంలో నుండి పడడం. ఇలా కథ ముగిసేది. ఫైట్ అప్పుడు హీరో ద్వంధయుద్ధం అయితే చాలా రియలిస్టిక్‌గా కంపోజ్ చేసేవారు ఫైట్ మాస్టర్లు. కొన్ని పట్లు, మెళుకువలూ మల్లయుద్ధ ప్రవీణుల చేత హీరోలకి నేర్పించేవారుట. కత్తి యుద్ధానికి కూడా కొన్నాళ్ళు తర్ఫీదు ఇప్పించేవారుట. మన కత్తి కాంతారావుగారు కత్తి యుద్ధం ఎంత బాగా చేసేవారు! ఎన్.టీ.రామారావు సీనియర్ మల్లయుద్ధంలో ప్రవీణులు. నాగేశ్వరరావు కర్ర తిప్పడంలో, కృష్ణ స్టంట్స్‌లో స్పెషలైజ్ చేసారు.

ఇప్పుడు వచ్చే సినిమాల్లో ఫైట్ సీన్స్ చూస్తుంటే 'చిత్రం భళారే విచిత్రం' కాదు 'చిత్రం భళారే వైపరీత్యం' అనాలనిపిస్తోంది.

ఒక హీరో అనామకుడు, అనాథ, పేవ్‌మెంట్స్ మీద పెరుగుతాడు. చదువు సంధ్యలు అస్సలే ఉండవు. ఏం తింటాడో ఎప్పుడు బాడీని ఆరు ప్యాక్‌లుగా మలుచుకుంటాడో మనకి అర్థం కాదు. ఒక్క చేత్తో వందల మందిని, అదీ టాటా సుమోల్లో, గాల్లో ఆయుధాలు తిప్పుతూ వచ్చేవాళ్ళని, చేతులు వెనక్కి కట్టుకుని తలతో కొడ్తుంటే, వాళ్ళు హాహాకారాలు చేస్తూ, గాల్లో ఒక్కోడూ ఎనిమిది, తొమ్మిది మైళ్ళు ప్రయాణించి పడ్తుంటారు. నిన్న ఓ సినిమా చూస్తుంటే, ఫైట్ వచ్చినప్పుడల్లా జనం మోసేస్తున్నారు. గాల్లోకి లేచి హీరో పిడి గుద్దుకి అలా తేలుతూ వెళ్తున్న వాళ్లని "ఎక్కడికిరా మీరంతా? టికెట్ ఏ ఊరుకి కొన్నారు?" అని ప్రేక్షకుల్లోంచి కామెంట్స్.

తలలు అరటి చెట్లు నరికినట్లు పరపరా నరికేస్తున్నారు. కళ్ళు పీకేస్తున్నారు ఒక్కోడు ఎంతమందినైనా నరికేయచ్చు. చట్టం, న్యాయం అసలా ఊళ్ళో ఉండవుట.

ఒక గవర్నమెంట్ ఆఫీసర్ "నా డ్యూటీ నేను చేస్తాను" అని డైలాగ్ చెప్పగానే, "చెయ్యమ్మా" అన్నాడొక ప్రేక్షకుడు. "నెక్స్ట్ సీన్లో చెయ్యలేకపోయానని చెప్తాడురా" అన్నాడు ఇంకోడు. అచ్చం అలాగే జరిగింది. "అసలు నిన్ను ఈ ఇంటికి రప్పించిందే నేను" అంటుంది హీరోయిన్ ఒక సస్పెన్స్ ముడి విప్పుతూ, "మాకు తెలుసులేవో! ఎన్ని సినిమాల్లో చూడలేదూ?" అని ఓ కుర్రాడు ఆడియెన్స్‌లోంచి అరిచాడు.

ఈ సినిమాల్లో వినోదం అనేది ఎంతవరకూ పండుతోందో తెలీదు కానీ, ఈ ఏక్షన్ సన్నివేశాలు (ఫైట్స్‌ని ఏక్షన్ అంటారు ఎందుకో? మిగతాదంతా సహజంగా చేస్తున్నారనా భావన) మాత్రం మనని కడుపుబ్బ నవ్విస్తాయి.

నాలుగు నాలుగు టాటా సుమోలు గాల్లోకి లేచి ఒకదానిని ఒకటి అక్కడే గాల్లో 'ఢీ' కొని కింద తునాతునకలై పడ్తుంటాయి.

విలన్‌ని కొడితే, కింద నేలంతా భూకంపం వచ్చినట్లు పగుళ్ళు తిస్తుంది. ఒకడు వెళ్ళి వాటర్ టాంకర్‌ని తలతో ఢీ కొడితే గోడ పగిలి మొత్తం నీళ్ళు కింద ప్రవహిస్తాయి.

హీరో చెయ్యికానీ, కాలుకానీ తగిలితే చాలు విలన్లు పైకి ఎగిరి అలా రెక్కలొచ్చినట్లు ఎగుర్తూనే ఉంటారు. హీరో గాల్లోకి ఎగిరి విలన్‌ని కొట్టుకోవడం, గాల్లో ఆకాశంలో కొన్ని సెకన్లు కాదు నిమిషాలు తేలుతూ కొట్టుకుంటారు. ఒకడ్ని కొట్టి, బంతిలా పైకి ఎగరేసి, వాడు కిందపడే లోపల హీరో మళ్ళీ ఎగిరి గాల్లోనే పట్టుకుని వాడి తలని తన తలతో ఢీ కొట్టి పగల కొట్టేస్తాడు. హీరో పెద్ద అరవై అంతస్తు బిల్డింగ్ మీద నుండి దూకినా సరే దార్లో ఆగి ఫైట్స్ చేసుకునే కింద (ఏ పారాచూట్ లేకుండా) తన ఇష్టం వచ్చిన చోట లాండ్ అయ్యే అద్భుత శక్తులు కలిగి ఉంటాడు. మామూలు మనుష్యులు ఒక మెట్టుమీంచి జారిపడితే చాలు తుంటిఎముక విరుగుతుంది.

హీరో తొడ కొడితే, దిక్కులు పిక్కటిల్లుతాయి, భూమి కంపిస్తుంది. కళ్ళు ఎర్ర చేస్తే, రక్తపు చారలు కనిపిస్తాయి. ఒక బిల్డింగ్ మీద నుండి ఇంకో బిల్డింగ్ మీదకి ఏ స్పైడర్ మాన్‌లాగో శక్తులు అక్కర్లేకుండానే జంప్ చేస్తాడు. సూపర్‌మెన్‌లా ఏ అతీత శక్తులూ, తుపాకులూ అనవసరం లేకుండానే, చేతులు వెనక్కి కట్టుకుని కూడా తలతో ఎన్ని వందల మందినైనా తుదముట్టించగలడు. ఒక్కోసారి టాటా సుమోల్నీ, కార్లనీ, రైళ్ళనీ చేత్తో పట్టి ఆపేస్తాడు. (డైరెక్టర్ తలుచుకుంటే కంటి చూపుతో కూడా ఆపేస్తాడు)

పెద్ద పెద్ద స్థంభాలనీ, కట్టడాలనీ, వాటర్ ట్యాంకర్లనీ ఒకే ఒక్క గుద్దుతో భళ్ళున విరగ్గొట్టకలడు. ఇంక కార్లూ, సుమోలూ, ఇన్నోవాలూ అయితే ఏం పాపం చేసుకున్నాయో కానీ, గాల్లోకి లేచి పేలిపోని సినిమా ఉండదు. కొంతమంది సుమోలో వెళుతున్నంత సేపూ భీకరంగా నవ్వుతూ చేతుల్తో కత్తులు గాల్లోకి తిప్పుతుంటారు. వెనక వ్యాన్‌లో వచ్చే వాళ్ళ సహచరుల చేతులకి అవి తగిలి తెగపడి పోవా?

ఇంక సైకిల్ చైన్లు పాతబడిపోయి, రైలు పట్టాలు కూడా పీకి కొట్టుకుంటారు కాబోలు. కాళ్ళూ, చేతులూ, తలా బీరకాయలు తరిగినట్లు తరిగేస్తున్నారు. సినిమా మొత్తం రక్తం కాలవలై పారుతూ ఉంటుంది. చివర్లో ఏ గవర్నమెంట్ ఆఫీసరో, పోలీసు ఆఫీసరో వచ్చి "నీ లాంటి పౌరుడు ఒక్కడున్నా దేశానికి చాలు" అని హీరోని పొగడడం, ప్రతి సినిమాలో ప్రతి హీరోనీ 'నువ్వేరా మగాడంటే నువ్వు ఒక్కడివే' అని ఓ పాత్ర చేత చెప్పిస్తుంటారు. అప్పటిదాకా వీళ్ళకి శత్రువైన విలను ఆఖరి సీనులో ఇలా పొగడడం మరీ విచిత్రం.

హీరో అసలు ఇన్ని అద్భుత శక్తులు కలిగి ఉండడానికి ఏ తాంత్రిక పూజలు చేస్తాడో, లేక ఏం తింటాడో అని నాలాగా చాలా మందికి కుతూహలం కలుగుతుంది అనుకుంట.

ఈ హీరోలంతా ఆ 'గోల్డ్ షాప్‌లో గోల్డ్ కొనండి' ఈ 'బట్టల షాప్‌లో బట్టలు కొనండి' 'ఇక్కడ బంగారం దాచండి' అని కాకుండా "ఈ కూరలు తినండి, ఫలానా ఈ ఫుడ్ తినండి మాలా మీరూ రాతిదేహులూ, సింహబలులూ అవుతారు" అని యాడ్స్ ఇస్తే లాభంగా ఉంటుందేమో?

కొంతలో కొంత మంచి ఏమిటంటే, వాటికి సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ ఇవ్వడం, మల్టీప్లెక్స్‌లు వారు సిన్సియర్‌గా పిల్లల్ని రానివ్వకపోవడం. కానీ ఇవి టీ.వీలో రాక తప్పవు, పిల్లలు చూసి అనుకరించక తప్పవు.

మనమే ఇలాంటివి చూసాకా తట్టుకోవడం కష్టం. పిల్లలు ఎలా తట్టుకోగలరు? ఆ పసి మనసుల్లో ఇలా చంపాలీ కొట్టాలీ. అదే హీరోయిజం అని పడిపోదూ! ఒక సినిమానే ఉద్దేశించి రాసినది కాదు, దాదాపు అన్ని పెద్ద సినిమాల్లో పరిస్థితీ, కథా ఇదే

ఏమైనా ఇలాంటి సినిమాలు అప్పుడప్పుడూ చూడాలి. సినిమా వినోద సాధనంకదా.

Click here to share your comments on this story.

